

● అకాల వర్షం

మామిడి రైతుకు నష్టం

● మూడు వేల ఎకరాల్లో రాలిపోయిన కాయలు



ఐరాల మండలంలో నేల రాలిన మామిడి కాయలు

అకాల వర్షంతో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు నష్టపోయారు. జిల్లాల విభజన తర్వాత చిత్తూరు జిల్లాలో మామిడి సాగు ప్రధాన పంటగా మారింది. 1,71,198 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తుండగా, తోతాపురి ప్రధాన రకంగా ఉంది. ఏటా ప్రతికూల వాతావరణంతో మామిడి రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది మే నెల మొదటి వారంలో అకాల వర్షం, తరచూ ఈదురు గాలుల కారణంగా దాదాపు మూడు వేల ఎకరాల్లోని మామిడి పిందె నుంచి కాయ దశలోనే నేల రాలాయి. ఇటీవల కురిసిన వర్షాలకు 1290 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతినగా, ఇందులో 1060 ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి పంట నష్టం రూ.1.93 కోట్లుగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు లెక్కలు కట్టారు. అధికారిక లెక్కలు పక్కన పెడితే క్షేత్ర స్థాయిలో పంటను కోల్పోయిన నష్టం ఇంకా ఎక్కువ ఉంటుంది. పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పూత దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు యాజమాన్య పద్ధతులు పాటించేందుకు ఎకరాలకు రూ.10 వేలు రైతులు ఖర్చు చేస్తున్నారు. కాపు నుంచి చేతికి అందే వరకు సోకే తెగుళ్ళ నుంచి పంటను కాపాడుకునేందుకు సుమారు నాలుగు సార్లు వివిధ రకాలైన మందులు పిచికారి చేస్తున్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.8 వేలు ఖర్చు చేయగా, కూలీలకు రూ.2 వేలు ఖర్చు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇంత ఖర్చు చేసినా దిగుబడి తక్కువే. ఉన్న మామిడి కాయలు కూడా ఇప్పుడు నేలరాలడంతో ఆందోళన చెందుతున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

రెండునెలలుగా పెరగని ధరలు

● ఆందోళనలో టమోటా రైతులు

పలమనేరు మార్కెట్‌యార్డులో రెండునెలలుగా టమోటాకు గిట్టుబాటు ధర లభించక వందలాది మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంతో పాటు చౌడేపల్లె, సోమల మండలాలనుంచీ రైతులు టమోటాలను పలమనేరు మార్కెట్‌యార్డుకు తీసుకు వస్తున్నారు. రెండు నెలలుగా పలమనేరు మార్కెట్ యార్డులో 15 కిలోల టమోటా బాక్సు ధర రూ. 200 దాటడం లేదు. రెండునెలలుగా వేసవిలో టమోటాకు మంచి ధరలు వస్తుందని ఆశించి వేలాది ఎకరాల్లో సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. టమోటా సాగుకు పెట్టిన పెట్టుబడికూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా పలమనేరు మార్కెట్ యార్డులో బాక్సు కేవలం రూ.145 ధర పలికింది. ఇటీవల టమోటా సాగుకు పెట్టుబడి విపరీతంగా పెరిగిందని, దీనికి తగ్గట్టు ఎరువుల ధరలు, కూలీల ధరలు పెరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. ఎండవేడిమి కారణంగా టమోటా తోటల్లో టమోటాలు పెద్దఎత్తున మాగిపోవడంతో రైతులు గత్యంతరం లేక మార్కెట్‌కు తీసుకొచ్చి తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మార్కెట్ యార్డుకు వచ్చిన టమోటాలు



- పలమనేరు

ఇప్పటి పరిస్థితుల్లో ఏ చిన్న పని చేసేందుకు వెళ్లినా పనిని బట్టి రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు కూలి ఇస్తున్నారు. కానీ, జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు మాత్రం దారుణంగా ఐదు రోజులకు రూ.1900 చొప్పున ఇచ్చారు. ఇదే విధులు నిర్వర్తించిన తెలంగాణలో మాత్రం రూ.3100 చొప్పున అందజేశారు. దీంతో పాటు ఆయా కేంద్రాల్లో సరైన సౌకర్యాలు, భోజన సదుపాయం లేక సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చాలా కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగడంతో ముఖ్యంగా మహిళా సిబ్బంది పడిన ఇబ్బందులు వర్ణనాతీతం.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఇదేమి పారితోషికం?

- పీవో, ఏపీవోలకు రూ.1900, ఓపీవోలకు రూ.900
- ఐదు రోజుల కష్టానికి ఇచ్చేది ఇంతేనా?
- దినసరి కూలి కంటే తక్కువని పోలింగ్ సిబ్బంది అసహనం
- తెలంగాణలో రూ.3100 చొప్పున అందజేత

సగటు పోలింగ్ ఉద్యోగి పడిన కష్టం

నింద్ర మండలానికి చెందిన ఓ మహిళా టీచర్‌కు కుప్పం నియోజకవర్గంలో పీవోగా ఎన్నికల విధుల్ని అప్పగించారు. ఇందులో భాగంగా ఓ విడత చిత్తూరులో, మరో విడత కుప్పంలో ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటిసారి పుత్తూరు మీదుగా చిత్తూరుకు రానుపోను 170 కిలోమీటర్లు, రెండోసారి కుప్పానికి రానుపోనూ 410 కిలోమీటర్లు ప్రయాణించారు. 12వ తేదీ కుప్పానికి తెల్లవారుజామున 3 గంటలకు ఏర్పాటుచేసిన బస్సెక్కి కుప్పం చేరుకున్నారు. వీవీ ప్యాట్లు, బ్యాలెట్ మిషన్లు తదితర ఎన్నికల సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. వెళ్లినప్పటి నుంచీ అర్ధరాత్రి వరకూ ఆయా పార్టీల ఏజెంట్లను పిలిపించుకుని మాట్లాడడం, వీఆర్వో, బీఎల్వోలను సమన్వయం చేసుకోవడంతో పాటు వివిధ ఏర్పాట్లను పూర్తి చేయించారు. దీంతో పాటు అర్ధరాత్రి వరకు ఓటరు స్లిప్పులను రాసుకోవడం, వందల సంఖ్యలో ఉన్న ఫార్మాట్లను పూరించడం చేశారు. ఆ రాత్రి తక్కువ సమయం కునుకు తీసిన తర్వాత 13వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచే పోలింగ్ సిబ్బంది అంతా మాక్ పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచీ పోలింగ్ ముగిసే వరకు ఒక్క క్షణం కూడా విరామం లేకుండా ఒత్తిళ్ల మధ్య పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా క్యూలో ఉన్న ఓటర్లకు టోకెన్లు ఇచ్చి అర్ధరాత్రి 12 గంటల వరకు ఓటేసే అవకాశం కల్పించారు. పోలింగ్ అనంతరం ఏజెంట్లకు ఇవ్వాల్సిన పోలింగ్ వివరాలను అందించారు. వీవీ ప్యాట్, బ్యాలెట్ బాక్సులను ఏజెంట్ల సమక్షంలో జాగ్రత్తగా సీళ్లు వేసి భద్రపరిచారు. తర్వాత కూడా దాదాపు 50 రకాల ఫార్మాట్లను నింపారు. అర్ధరాత్రి వచ్చిన ఆర్టీసీ బస్సుల్లో బందోబస్తు నడుమ ఎన్నికల సామగ్రిని రిసెప్షన్ కేంద్రాలకు తరలించారు. అక్కడ ఏర్పాటుచేసిన పలు కౌంటర్ల వద్ద నిర్దేశించిన ఎన్నికల సామగ్రిని, వివరాలను అందించారు. కంటి మీద కునుకు లేకుండా రెండు పగళ్లు, రెండు రాత్రుళ్లు పని చేస్తూనే, అధికారుల నుంచి డ్యూటీ సర్టిఫికెట్లను తీసుకున్నారు.



300 కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్

ఈసారి ఓటర్లు పోటెత్తారు. జిల్లా చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ రోజు 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్ జరగాల్సి ఉంది. 300 కేంద్రాల్లో రాత్రి 9 గంటలకు పోలింగ్ ముగియగా.. సుమారు 300 కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగింది. 6 గంటల తర్వాత క్యూ లైన్లలో ఉన్నవారికి ఎన్నికల సిబ్బంది టోకెన్లను జారీచేసి ఓటు వేయించారు. దీంతో ఎన్నికల సిబ్బంది పోలింగ్ ముగిసే వరకు అక్కడే ఉండి, ఆ తర్వాత రెండు గంటలపాటు పోలింగ్ ప్రక్రియ పూర్తి చేసి రిసెప్షన్ సెంటర్‌లో సామగ్రిని చేర్చారు.

పీవోలకు రూ.350.. ఓపీవోలకు రూ.250

ఎన్నికల విధులకు హాజరయ్యే పీవో, ఏపీవోలు జిల్లా కేంద్రంలో ఓసారి, విధులు కేటాయించిన నియోకవర్గ కేంద్రంలో మరోసారి శిక్షణకు హాజరయ్యారు. ఆ తర్వాత 12, 13, 14 తేదీల్లో పోలింగ్ విధుల్లో పాల్గొన్నారు. మొత్తంగా పీవో, ఏపీవోలు ఐదు రోజుల పాటు ఎన్నికల విధుల్ని నిర్వహించారు. రోజుకు రూ.350 చొప్పున 5 రోజులకు రూ.1750, టీఏ, డీఏ రూ.150 చొప్పున మొత్తం రూ.1900 అందించారు. జిల్లాలో 1771 పోలింగ్ కేంద్రాలుండగా, ప్రతి కేంద్రానికీ ఓ పీవో, ఓ ఏపీవోలు పనిచేశారు. శిక్షణ లేకుండా కేవలం ఎన్నికల ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఓపీవోలకు రూ.250 చొప్పున మూడు రోజులకు రూ.750, టీఏ డీఏ రూ.150 కలిపి.. మొత్తంగా 900 అందించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ నలుగురు ఓపీవోలు పనిచేశారు.

నిట్టూరుస్తున్న ఉద్యోగులు

తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజులు విధులు నిర్వర్తించిన పీవో, ఏపీవోలకు రూ.3100 చొప్పున చెల్లించారని, రాత్రింబవళ్లు కష్టపడినందుకు తక్కువ పారితోషికం ఇవ్వడం దారుణమని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దినసరి కూలి కంటే తక్కువ పారితోషికం ఇచ్చి అవమానించడం కంటే ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికల కోసం ఉచితంగా పని చేయించుకున్నా ఆత్మసంతృప్తి మిగిలేదని నిట్టూరుస్తున్నారు.

మెనూ మేరకు భోజనాలు ఇవ్వలేదు

ఎన్నికల సంఘం 12, 13 తేదీల్లో సిబ్బందికి అందించాల్సిన భోజనాలు, స్నాక్స్ మెనూ విడుదల చేసింది. ఆ మేరకు అందించాలని సూచించింది. అన్నీ లభ్యమయ్యే పట్టణ ప్రాంతాల్లో పర్లేదు కానీ, గ్రామీణ ప్రాంతాల్లో మెనూ ప్రకారం భోజనాలు, స్నాక్స్ అందించలేకపోయారు. ఎన్నికల సామగ్రి అప్పగించిన తర్వాత 13వ తేది అర్ధరాత్రి వేళ రిసెప్షన్ కేంద్రాల్లో భోజనాలు లేకపోయినా.. ఉద్యోగులు తమ బ్యాగుల్లో తెచ్చుకున్న బిస్కెట్లను తినేసి ఉసూరుమంటూ ఇళ్లకు వెళ్లారు.

సౌకర్యాల కొరత

పోలింగ్ కేంద్రాలన్నీ ఉన్నత, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటుచేశారు. 12వ తేదీ ఉదయం డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది అక్కడి నుంచి సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. అక్కడ అన్నిరకాల ఏర్పాట్లు చేసుకుని ఆ రోజు రాత్రి అక్కడే కింద పడుకున్నారు. 13న తెల్లవారుజాము నుంచే విధుల్లో నిమగ్నమయ్యారు. చాలాచోట్ల వారికి సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు ఇబ్బందులు తప్పలేదు. పోలింగ్ కేంద్రంలో జరిగే కార్యకలాపాలు బయటికి తెలియకూడదనే నిబంధన కారణంగా లోపల కిటికీలన్నీ మూసేశారు. దీంతో ఎండ వేడిమికి కేంద్రం లోపలి సిబ్బంది అల్లాడిపోయారు.

పోలింగు సిబ్బంది ఇబ్బందులెన్నో?

వి.కోట మండలం ఎస్.బండపల్లెలో 212, 213 పోలింగ్ కేంద్రాలున్నాయి. 212 కేంద్రంలో ఈవీఎం, వీవీ ప్యాట్లు 13వ తేదీ అర్ధరాత్రి స్విచ్ఆఫ్ అయిపోయాయి. (సహజంగా అలా ఆఫ్ అయిపోతాయి) టెక్నికల్ టీమ్ సాయంతో 14వ తేదీ తెల్లవారుజామున 1.30 గంటలకు కొత్త ఈవీఎం, వీవీ ప్యాట్లను అమర్చారు. మిగిలినవారు ఓటు వేసేసరికి 3.30 గంటలైంది. మిగతా ప్రక్రియ పూర్తి చేసుకుని ఉదయం 5.30 గంటలకు ఉద్యోగులు అక్కడి నుంచి బయలుదేరారు. అదే ప్రాంగణంలో ఉన్న 213 కేంద్రంలో 13వ తేదీ రాత్రి10.30గంటల వరకు పోలింగ్ జరిగింది. ప్రక్రియ ముగించుకుని అక్కడి నుంచి సిబ్బంది వెళ్లేసరికి 12.30 గంటలైంది. ఇదే మండలం జవునిపల్లెలోని రెండు కేంద్రాల్లోనూ అర్ధరాత్రి 12.30 వరకు పోలింగ్ జరిగింది.

రెండేళ్లుగా బీఎల్వోలకు గౌరవ వేతనమేదీ?

జిల్లాలో 1771 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్రానికి ఒక బీఎల్వో పని చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి రూ.700 చొప్పున వీరికి గౌరవ వేతనం రావాలి. రెండేళ్లుగా బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల ఎంపిక, ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఓటర్ల నమోదు, ఓటర్ లిస్టు అప్‌డేషన్, ఇంటింటికి ఓటరు స్లిప్పుల పంపిణీ.. వంటి విధుల్లో నిరంతరాయంగా పాల్గొన్నారు. రెండేళ్లకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.5600 చొప్పున గౌరవ వేతనం అందాల్సి ఉంది. రెండు రోజులు ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి వెంటనే పారితోషికం ఇచ్చారని, రెండేళ్లుగా కష్టపడిన తమకు ఇవ్వకపోవడం దారుణమని జిల్లాలో బీఎల్వోలు ఆవేదన చెందుతున్నారు.



రెండు మినీ లారీలు ఢీ

● ఒకరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

గుడిపాల, మే 16: మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో గురువారం ఉదయం రెండు ఈచర్లు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఈచర్ చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్తున్న మరో ఈచర్ వాహనాన్ని ఎంసీఆర్ క్రాస్‌లోని భద్రకాళమ్మ ఆలయం వద్ద ఢీకొంది. తమిళనాడుకు చెందిన ఈచర్ డ్రైవర్ సుదర్శన్ (24) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఈచర్ డ్రైవర్ షేక్ దావూద్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన ఈచర్ వాహనం - మృతిచెందిన సుదర్శన్

పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో

13 మంది అరెస్టు

● కడప సెంట్రల్ జైలుకు నిందితుల తరలింపు

తిరుపతి(నేరవిభాగం), మే 16: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో మొత్తం 13మందిని అరెస్టు చేశారు. నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ని మంగళవారం సాయంత్రం పరిశీలించి వస్తున్న నాని, అతని గన్‌మేన్ ధరణిపై వైసీపీ శ్రేణులు సమ్మెటలు, రాడ్లు, రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నాని చేతికి బలమైన గాయమవగా, గన్‌మేన్ కంటిపై తీవ్ర రక్తగాయమైంది. ఈ ఘటనపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు, ఎన్నికల కమిషన్‌కూ నానీ ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లడంతో వర్సిటీ సీఐ మురళీమోహన్‌రావు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు వేగవంతం చేశారు. సంఘటన జరిగిన రోజునే ఏడుగురిని రోజు అదుపులోకి తీసుకోగా, మిగిలిన ఆరుగురిని బుధవారం రాత్రి పట్టుకుని విచారించారు. గురువారం వీరిని అరెస్టు చూపారు. నిందితులపై హత్యాయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. కాగా, 13 మంది నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తిరుపతి డీఎస్పీ సురేంద్ర రెడ్డి, సీసీఎస్ డీఎస్పీ రవికుమార్, ఎస్వీయూ సీఐ మురళీమోహన్‌రావు, ఎస్‌ఐ రామాంజనేయులు, అంజనప్ప, ఐడీ పార్టీ సిబ్బంది ఏఎస్‌ఐ దామోదర్, మోహన్‌బాబు, ఈశ్వర్, సిబ్బందిని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

నిందితుల వివరాలిలా..

ప్రధాన నిందితుల్లో రామచంద్రాపురం మండలం దిగువ రామాపురానికి చెందిన జడ్పీటీసీ భర్త వల్లేటి భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి ఉండగా, మిగిలిన వారిలో.. దిగువ రామాపురానికి చెందిన ముదిపల్లి జానకి రెడ్డి, జానయ్యగారి జయచంద్రా రెడ్డి, పొదలకూరు కోదండమ్, బొక్కిసం చిరంజీవి, దండు పుష్పకాంత్ రెడ్డి, అదే మండలం గడ్డక్రింద పల్లికి చెందిన ఎద్దల భాస్కరరెడ్డి, కామసాని సాంబశివా రెడ్డి, తిరుమల బాలాజీ నగర్‌కు చెందిన అప్పన్నగారి సుధాకరరెడ్డి, తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లిలో కాపురమున్న పి.హరికృష్ణ, తిరుమల బాలాజీనగర్‌కు చెందిన పసుపులేటి రాము, రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన గోగుల కోటయ్య ఉన్నారు.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 16: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు ఆరు మండలాల్లో వర్షం కురిసింది. గంగవరంలో 46.8మి.మీ, బైరెడ్డిపల్లె 13.6, విజయపురం 9.2, కుప్పం 2.0, నింద్ర 1.8, కార్వేటినగరంలో 1.6 మిమీ వర్షపాతం నమోదైంది. నగరిలో ఇంతవరకు ఒక్క చుక్క వర్షం కూడా నమోదు కాలేదు.



కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 16: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న పనులను డీఆర్వో పుల్లయ్యతో కలిసి పరిశీలించారు. జూన్ నాలుగవ తేదీ ఎస్వీసెట్‌లో చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపడుతున్నామన్నారు. దానికి సంబంధించి కేంద్రాల లోపల టేబుళ్ళ, సీటింగ్ అరెంజ్‌మెంట్లు చేపట్టాలన్నారు. లెక్కింపు ప్రక్రియ పూర్తిగా సీసీ కెమెరాల నిఘాతో వీడియోగ్రఫీ చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆయన కళాశాలలోని స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ నరసింహులు ఆయన వెంట ఉన్నారు.

ఊహించిందే జరిగింది!

- ● జిల్లా ఎస్పీ బదిలీ ● తిరుపతి డీఎస్పీ, ఎస్బీ డీఎస్పీ సస్పెన్షన్
- ● స్పెషల్ బ్రాంచి సీఐ, అలిపిరి సీఐ కూడా.. ● ఐదుగురిపైనా శాఖాపరమైన విచారణ
- ● ఎన్నికల కమిషన్ సంచలనాత్మక చర్యలు
- ● చంద్రగిరి నియోజకవర్గంలో 'పోలింగ్'.. అనంతర హింసాత్మక ఘటనలపై ఆగ్రహం

సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలను నియంత్రించడంలో పోలీసు యంత్రాంగం విఫలం కావడంతో అంతా ఊహించినట్టుగానే జరిగిపోయింది. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌పై బదిలీ వేటు వేసిన ఎన్నికల కమిషన్.. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని సస్పెండు చేసింది. ఎస్పీ సహా వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. దీనికి తోడు ఈసీ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం జిల్లాలో కూడా హింసాత్మక ఘటనల పూర్వాపరాలను, వాటిని అడ్డుకోవడంలో, అనంతర చర్యల్లో ఎస్పీ సహా కింది స్థాయి అధికారులు వ్యవహరించిన తీరును లోతుగా విచారించి ఈసీకి నివేదిక ఇవ్వనుంది. ఎన్నికల నిర్వహణను ఆషామాషీగా తీసుకున్న అధికారులు దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నామినేషన్ల నాడే తొలి ప్రమాద ఘంటికలు

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థులను గత నెల 25వ తేదీన ఒకే సమయంలో నామినేషన్లకు అనుమతించినప్పుడే అధికారుల అవగాహనా రాహిత్యం బట్టబయలైంది. టీడీపీ అభ్యర్థి కోసం భారీ ఎత్తున తరలివచ్చిన శ్రేణులను పోలీసులు నియంత్రించలేకపోయారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఇరువర్గాలూ రాళ్ల దాడికి దిగడంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై రాళ్లు, కర్రలతో దాడి జరిగింది. లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పుడే అధికారులు అప్రమత్తమై చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించివుండాల్సింది. కానీ అలా జరగలేదు.

నానీపై దాడి ఘటనలో బట్టబయలైన పోలీసు వైఫల్యం

పోలింగ్ మరునాడు టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన దాడి ఘటనలో పోలీసు వైఫల్యం బయటపడింది. నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తనకు, తన కుటుంబానికి తగిన రక్షణ లేదని ఆయన హైకోర్టును ఆశ్రయించి గన్‌మెన్ భద్రత పొందారు. అలా పొందిన కొద్ది రోజులకే ఆయనపై ఏకంగా హత్యాయత్నం జరిగింది. ప్రధాన ప్రతిపక్ష నేతకు తగిన భద్రత కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమైంది. తర్వాత కూడా అక్కడ పరిస్థితులను అదుపు చేయడంలో పోలీసు యంత్రాంగం చేతులెత్తేసింది. వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఈ దాడి ఈవీఎంలు వుంచిన స్ట్రాంగ్ రూముల భద్రతను కూడా ప్రశ్నార్థకం చేసింది.

డక్కిలి, చిల్లకూరు మండలాల్లోనూ హింసాత్మక ఘటనలు

- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వరరెడ్డికి తిక్కగుంటపాలెంలో రొయ్యల చెరువులు ఉన్నాయి. పోలింగ్‌కు ముందు రోజైన ఆదివారం రాత్రి రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపారు. దీంతో రూ. 15 లక్షలు విలువైన రొయ్యలు చనిపోయి నీటిపైకి తేలాయి. ఈ ఘటనపై బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశాడు.
- వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలం అల్తూరుపాడులో పోలింగ్ రోజు ఓ కానిస్టేబుల్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు దాడి చేసి కొట్టారు. ● గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత గోపాల్ పోలింగ్ రోజు టీడీపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపిస్తూ మరుసటి రోజైన మంగళవారం వైసీపీ వర్గీయులు ఇనుప రాడ్లతో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచారు.
- చిల్లకూరు 114, 117 బూత్‌లలో పోలింగ్ రోజు టీడీపీ నేత కొండా రామచంద్రారెడ్డిపై వైసీపీ నేత నరేంద్ర రెడ్డి దాడి చేసి కొట్టారు. బాధితునికి రక్షణ కల్పించాల్సిన చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి దానికి భిన్నంగా బాధితుడినే లాఠీతో చితకబాదారు. తోపులాట, ఘర్షణతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌తో పాటు టీడీపీ దళిత మహిళా నేత విజయ కూడా గాయపడ్డారు.

పోలింగ్ రోజు ఐదు చోట్ల ఉద్రిక్తత

ఈనెల 13న పోలింగ్ సందర్భంగా రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ ఘర్షణ జరిగింది. బీఎస్ఎఫ్ జవాన్ గాల్లోకి కాల్పులు జరిపినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి భారీగా అనుచరులను వెంటదీసుకుని టీడీపీ కంచుకోట వంటి ఆ గ్రామంలోకి వచ్చి తమ ఏజంట్లపై దాడి చేసింది ఎవరంటూ టీడీపీ ఏజంట్లపై దౌర్జన్యానికి యత్నించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. అదే రోజు నానీ స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వెళ్లిన వైసీపీ అభ్యర్థిని గ్రామస్తులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. ఆయన్ను నిర్బంధించారన్న ప్రచారంతో తుమ్మలగుంటలో గ్రామస్తులు పోలింగ్ కేంద్రాన్ని చుట్టుముట్టి మోహిత్ క్షేమంగా వచ్చేవరకూ ఈవీఎంలను తరలించడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. అక్కడ టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచివారిపల్లి గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడులు, ప్రతిదాడులకు పాల్పడ్డారు. ఆ గ్రామాలకు మోహిత్ అనుచరులతో వెళ్లడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు కార్లను టీడీపీ వర్గీయులు తగులబెట్టారు.




పోలింగ్ రోజున బ్రాహ్మణ కాల్వ పోలింగ్ కేంద్రంలో ఘర్షణ



ఈనెల 13న కూచివారిపల్లిలో చెవిరెడ్డి మోహిత్, పులివర్తి వినీల్ మధ్య వాగ్వాదం

కలెక్టర్ లక్ష్మీశా బదిలీతో అప్రమత్తం కాని యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకు మించి విధులు నిర్వర్తిస్తున్న అధికారుల బదిలీల్లో భాగంగా కలెక్టర్ వెంకట్రమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా గత డిసెంబరులో కలెక్టర్‌గా వచ్చారు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని ఇంటికి వెళ్ళి మరీ కలసి శాలువా కప్పి సత్కరించడంతో ప్రతిపక్షాల నమ్మకాన్ని కోల్పోయారు. ప్రతిపక్ష పార్టీల నేతల ఫిర్యాదుతో ఈసీ ఆయన్ను గత నెల 2వ తేదీన బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్‌గా నియమించింది. ఈసీ తీరు ఎలా వుందో ఈ ఘటన స్పష్టంగా వెల్లడించినా జిల్లాలో అధికారులు మాత్రం అప్రమత్తం కాలేదు.

మరోసారి గంగలో కలసిన జిల్లా పరువూ ప్రతిష్ఠ

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరంగా విఫలమైన నాటి కలెక్టర్ భరత్ నారాయణ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో పలమనేరు డీఎస్పీ, శ్రీకాళహస్తి, పుంగనూరు సీఐలపైనా బదిలీ వేటు పడింది. తర్వాత తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఘటనలతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరీశా, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఇద్దరు సీఐలు, ఓ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసిల్దారు సస్పెన్షన్‌కు గురయ్యారు. తాజా ఎన్నికల్లో తిరుపతి కలెక్టర్ లక్ష్మీశా కూడా బదిలీ వేటుకు గురయ్యారు. ఈ ఘటనలతో ఇప్పటికే దారుణంగా దెబ్బతిన్న జిల్లా పరువు ప్రతిష్ఠలు తాజాగా ఈసీ ఆదేశాలతో మరింతగా గంగ పాలయ్యాయి.

అనుభవలేమితో ఎస్పీ తప్పటడుగు!

శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల నిర్వహణల్లో తగిన అనుభవం, అవగాహన లేకపోవడంతోనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తప్పటడుగు వేసినట్టు తెలుస్తోంది. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన ఈయన రంపచోడవరంలో అసిస్టెంట్ ఎస్పీగా, కర్నూలు జిల్లాలో సెబ్ ఏఎస్పీగా, విజయవాడలో లా అండ్ ఆర్డర్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. ఎస్పీగా తిరుపతిలోనే తొలి పోస్టింగ్. సరిగ్గా ఎన్నికల సమయంలో ఎస్పీగా విధులు చేపట్టడంతో తగిన అనుభవం, అవగాహన లేక కింది స్థాయి అధికారులపై ఆధారపడటం ఆయనకు చేటు చేసింది. అనుభవం, సమర్థత కలిగిన తదుపరి స్థాయి అధికారులు వున్నప్పటికీ వారిని పక్కనపెట్టి వారి కంటే కింది స్థాయిలో వున్న కొందరు అధికారులపై ఆధారపడ్డారని, అధికార పార్టీ నేతలతో అంటకాగుతున్న వారి సలహాలు, సూచనలతోనే విధి నిర్వహణలో విఫలమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. 2014 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో ఘర్షణలు జరగడం, 2019లో ఏడు చోట్ల రీ పోలింగ్ జరగడం వంటి గత చరిత్రను ఎస్పీ పూర్తిగా విస్మరించినట్టు కనిపిస్తోంది. దీనికి తోడు తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నాటి ఘర్షణలు, 2021 తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఉదంతాలూ పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు. జిల్లాకు ఎస్పీగా వచ్చినపుడు ఇక్కడి గత చరిత్రను తెలుసుకుని దానికనుగుణంగా జాగ్రత్తలు తీసుకుని వుంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

తిరుపతి ఎమ్మెల్యే బహిరంగంగా బెదిరించినా..

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పోలింగ్‌కు రెండు రోజులు ముందు జీవకోనలో ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధులను బెదిరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అంతు చూస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఇది ఉల్లంఘించడమే అయినా పోలీసులు స్పందించలేదు. జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బెదిరింపులు మళ్ళీ కొనసాగుతుండడంతో మరోసారి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘాలు యత్నించినా కనీసం కలిసేందుకు కూడా ఆయనఅవకాశం ఇవ్వలేదు.

కులం పేరుతో దూషించి.. కొట్టారు

● రామకుప్పం ఎస్ఐపై గిరిజనుడి ఫిర్యాదు

రామకుప్పం, మే 16: తనను కులం పేరుతో దూషించి, లాఠీతో కొట్టారంటూ రామకుప్పం మండలం వీర్నమలతాండాకు చెందిన వెంకటేష్‌నాయక్ గురువారం ఎస్ఐ శివకుమార్‌పై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. సోదరులైన వెంకటేష్‌నాయక్, షణ్ముఖనాయక్, లోకేంద్రనాయక్ వీర్నమలతాండా సమీపంలోని పొలాల్లో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వీరు బెంగళూరులో కంప్రెసర్ బండ్లు పెట్టుకుని, కూలిపనులు చేసుకుంటున్నారు. ఓట్లేయడానికి వీరంతా స్వగ్రామానికి వచ్చారు. కాగా, వెంకటేష్‌నాయక్‌కు వచ్చే అదనపు పనులను లోకేంద్రనాయక్‌కు ఇస్తుండటంపై, మరో సోదరుడు షణ్ముఖనాయక్ ఆగ్రహంతో ఉన్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తమ ఇంటి ముందు కత్తులు నూరుతున్న షణ్ముఖనాయక్, అతడి భార్య మంజు, కుమారుడు బాలాజీనాయక్‌ను చూసి ఎందుకిలా చేస్తున్నారని వెంకటేష్‌నాయక్ ప్రశ్నించగా, నీ కుటుంబాన్ని చంపడానికంటూ వారు దుర్భాషలాడారు. వెంటనే షణ్ముఖనాయక్ కత్తితో వెంకటేష్ కుడిచేతిపై నరికాడు. అడ్డు వచ్చిన వెంకటేష్‌నాయక్ కుమారుడు ఠాగూర్‌నాయక్‌ను బాలాజీనాయక్ కర్రతో తలపై కొట్టాడు. లోకేంద్రనాయక్ కుమారుడు ఈశ్వర్‌నాయక్ వచ్చి వారిని కాపాడారు. ఠాగూర్‌నాయక్‌ను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం వెంకటేష్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షణ్ముఖనాయక్, మంజు, బాలాజీనాయక్‌పై ఎస్ఐ కేసు నమోదు చేశారు. అనంతరం వెంకటేష్‌నాయక్‌తోపాటు షణ్ముఖనాయక్, లోకేశ్‌నాయక్‌ను ఎస్ఐ తన గదికి పిలిపించారు. అదే సమయంలో అయనకు ఫోన్ వచ్చింది. ఆ తర్వాత వారిని దుర్భాషలాడారు. దీనిపై ప్రశ్నించగా, కులం పేరుతో దూషించి, లాఠీతో కొట్టారని బాధితులు ఆవేదన చెందారు. అదే సమయంలో స్టేషనుకు వచ్చిన టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ చూసి.. వారిని ఎందుకు కొడతారంటూ ఎస్ఐని అడగ్గా, అతడినీ దుర్భాషలాడుతూ బొక్కలో వేస్తానని బెదిరించారన్నారు. ఎస్ఐపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వెంకటేష్‌నాయక్ తన ఫిర్యాదులో కోరారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోండి : దళిత, గిరిజనులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్న ఎస్ఐ శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయక్, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణానాయక్, కామరాజనాయక్, గిరిజనతాండాల నేతలు డిమాండు చేశారు. వీర్నమల తాండాలో ఘర్షణ పడ్డ సోదరులు పోలీస్‌స్టేషనుకు వస్తే వారిపై ఎస్ఐ దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. ఆదివారం సాయంత్రంలోగా ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే, సోమవారం ఉదయం కుప్పం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. దీనిపై ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. ఇదంతా టీడీపీ నేత కృష్ణానాయక్ ఆడిస్తున్న నాటకమని ఆరోపించారు. తాను ఎవరినీ కులం పేరుతో దూషించలేదని, లాఠీతో కొట్టలేదన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు మొదలై చాలా రోజులైనప్పటికీ ఎన్నికల కారణంగా కొండపై రద్దీ తక్కువగానే కనిపించింది. వారాంతాల్లో మినహా మిగిలిన రోజుల్లో చాలా సాధారణంగా ఉంది. రాజకీయ నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో నిమగ్నం కావడంతో వీఐపీ బ్రేక్‌లో కూడా వీఐపీలు తక్కువగా కనిపించారు. ఈనెల 13వ తేదీతో పోలింగ్ ప్రక్రియ పూర్తవడంతో ఇటు సాధారణ భక్తులు, అటు వీఐపీలు తరలివస్తున్నారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి ఆలయం, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, లడ్డూకౌంటర్ వంటి ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ పెరిగిన నేపథ్యంలో గదుల కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరుతున్నారు. కల్యాణకట్టల్లోనూ రద్దీ అధికంగా ఉంది.



ఆలయం ముందు భక్తుల రద్దీ



దక్షిణ మాడవీధిలో భక్తులు ప్రదక్షిణ చేయడానికి వీల్లేకుండా పెట్టిన గేట్

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలో షెడ్లు నిండిపోవడంతో సర్వదర్శన భక్తులకు 24 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ మైకుల ద్వారా ప్రచారం చేస్తోంది.

ప్రదక్షిణ చేయనీయకుండా గేట్లు?

రద్దీ పెరిగిన క్రమంలో చాలా మంది భక్తులు కనీసం ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి, అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి వెళ్లిపోతుంటారు. అయితే రద్దీ పెరిగిందనే పేరుతో దక్షిణ మాడవీధిలోని మూవింగ్ బ్రిడ్జి వద్ద ఉన్న గేటును మూసివేసి భక్తులకు ప్రదక్షిణ చేసే అవకాశం కూడా లేకుండా చేశారు. దాంతో ఇటు స్వామి దర్శనం లభించక, అటు గుడి చుట్టూ ప్రదక్షిణ కూడా చేసే అవకాశం లేకపోవడంతో చాలా మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా మూవింగ్ బ్రిడ్జి సమీపానికి చేరుకునేవారితో అక్కడున్న భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారంటూ పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

రఘురామకృష్ణరాజు



రేణిగుంట, మే 16: ఓటమి భయంతోనే కూటమి నాయకులపై వైసీపీ దాడులకు పాల్పడుతోందని పశ్చిమగోదావరి జిల్లా ఉండి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు విమర్శించారు. గురువారం తిరుపతి విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్, సజ్జల మాటల్లో ధ్వనిస్తున్న వణుకు వారి ఆందోళనను చాటుతోందన్నారు. వారి ముఖ కవళికలు చూస్తే స్పష్టంగా ఓటమి అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో ఈ 15రోజులూ కేడర్‌లో జోష్‌ను నింపేందుకు 150 స్థానాలు స్థానాలు గెలుస్తున్నామని వైసీపీ నేతలు చెబుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిసున్నారన్నారు. కూటమి 1994లో కన్నా 130, 135 స్థానాలు విజయం సాధిస్తుందన్నారు. 150 స్థానాలు సాధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఆయన చంద్రగిరి కూటమి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించేందుకు వెళ్లారు.

తిరుపతిలో కారు దగ్ధం

తిరుపతి(నేరవిభాగం),మే16: ఇంజిన్ వేడెక్కి.. బ్యాటరీల నుంచి మంటలు చెలరేగడంతో ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన తిరుపతి గరుడ సర్కిల్ సమీపంలో జరిగింది. నంద్యాల జిల్లా బనగానపల్లెకి చెందిన ఎం.శ్రీనివాస రెడ్డి కుటుంబీకులతో తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం కారులో గురువారం తిరుపతికొచ్చారు. అనంతరం మోహన్‌బాబు కాలేజీ వద్దకెళ్లి అక్కడ తెలిసిన వారితో మాట్లాడి జూ పార్కు రోడ్డులో తిరుపతికి బయల్దేరారు. గరుడ సర్కిల్ సమీపానికి వచ్చేసరికి కారుఇంజిన్ వేడెక్కి,ఉన్నట్టుండి బ్యాటరీలనుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనంలోని వారిని దింపేయడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలావరకు దగ్ధమవగా, రూ.3లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపకశాఖ తిరుపతి జిల్లా అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మృత్యుఒడికి ముగ్గురు అక్కా చెల్లెళ్లు

● దీపాలు వదులుతూ చెరువులో జారిపడి మృతి



విలపిస్తున్న తల్లి విజయ



రూపిక, చరిత, యాషిక మృతదేహాలు

వడమాలపేట, మే 16: దీపాలు చెరువులో వదులుతుండగా ప్రమాదవశాత్తూ ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడ్డారు. వివరాలివి. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రూపిక(10) 5వ తరగతి, చరిత(13) 9వ తరగతి, యాషిక(ఇంటర్మీడియట్) చదువుతున్నారు. బాబు గ్రామంలో ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తారు. గురువారం అతను మహాశివుని దర్శనార్థం తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. భార్య విజయ తన కుమార్తెలతో దిగువ గూళూరు వద్ద శివాలయంలో పూజ చేయడానికి వెళ్లింది. ఆమె పూజ చేస్తుండగా.. గూళూరు చెరువులో దీపాలు వదలడానికి ముగ్గురు అక్కాచెల్లెళ్లు వెళ్లారు. మెట్ల మీద కూర్చొని దీపాలు వదులుతుండగా రూపిక జారి పడింది. వెంటనే కాపాడడానికి ప్రయత్నిస్తూ ఇద్దరు అక్కాచెల్లెళ్లు చెరువులో దూకారు. వీరి అరుపులు, కేకలు విని సమీపంలోని స్థానికులు వెళ్లారు. కానీ అప్పటికే ముగ్గురూ చెరువులో మునిగి చనిపోయారు. తల్లి విజయ చెరువు దగ్గర కన్నీరుమున్నీరైంది. ముగ్గురి మృతదేహాలను గ్రామస్తులు బయటకు తీశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం

అక్కాచెల్లెళ్ల మృతి సంఘటనతో గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. పుత్తూరు ప్రభుత్వాస్పత్రి పరిసరాలు కుటుంబీకులు, బంధువుల రోదనలతో నిండిపోయాయి. ముగ్గురు కుమార్తెలనూ కోల్పోయిన తల్లి విజయను ఓదార్చడం ఎవరి తరమూకాలేదు. పెద్దకుమార్తె యాషిక ఇంటర్‌లో 990 మార్కులు సాధించింది. అప్పు చేసి.. తిరుపతిలోని ప్రైవేటు కళాశాలలో చదివించారని స్థానికులు చెబుతున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు 144 సెక్షన్ అమలు



గ్రామాల్లో 144 సెక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రాఘవరెడ్డి

పుంగనూరు, మే16: ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రజలు భావోద్వేగాలకు గురి కాకుండా గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పుంగనూరు అర్బన్ సీఐ రాఘవరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వనమలదిన్నె, ఆరడిగుంట పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్షపార్టీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి బాణసంచా పేల్చడం వంటి పనులు చేయరాదన్నారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వైర్ల దొంగ

పలమనేరు, మే16: పలమనేరు మండలం ముసలిమడుగు, ఏటిగడ్డిండ్లు, కాలువపల్లి తదితర గ్రామాల్లోని వ్యవసాయ బోరుబావుల వద్ద వైర్ల చోరీలకు పాల్పడుతున్న మల్లు అనే అనుమానితుడిని గ్రామస్తులు గురువారం పోలీసులకు పట్టించారు. గ్రామస్తుల కథనం మేరకు... మదనపల్లి సమీపం ఆవులపల్లికి చెందిన యానాది మల్లు పలమనేరు మండలం ఏటిగడ్డిండ్లు యానాది కాలనీకి చెందిన రోజాను పెళ్లి చేసుకున్నాడు. అయితే మల్లు భార్యతో గొడవపడి కొన్నినెలల క్రితం ఆవులపల్లికి వెళ్లిపోయాడు. అయితే అప్పుడప్పుడు యానాది కాలనీకి వచ్చి రాత్రివేళల్లో వ్యవసాయ బోర్ల వైర్లు చోరీకి పాల్పడుతుండే వాడు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బోరుబావుల వద్ద కేబుల్ వైర్లను దొంగిలించి నిప్పుపెట్టికాల్చి అందులోని రాగివైర్లను సేకరిస్తున్న సమయంలో వాసన రావడంతో రైతులు గమనించి బోరు మోటర్ల వద్దకు వెళ్లగా అప్పటికే కేబుళ్లు కత్తిరించినట్లు గుర్తించారు. గురువారం ఉదయం పలమనేరు వద్ద ఆటోలో వెళ్తున్న యానాది మల్లును గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పలమనేరు పోలీసులు మల్లును విచారణ చేస్తున్నారు.

ప్రహరీకి నోచుకోని బీసీ హాస్టల్ భవనం



కల్లూరు, మే 16: కల్లూరులోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ భవనానికి ఒక వైపు మామిడితోట, మరోవైపు గంటావారిపల్లి రోడ్డు ఉండటంతో వాహనాల రాకపోకలు, పాముల బెడదతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ నవీన్ మాట్లాడుతూ కల్లూరు బీసీ హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి, బోరు, పైపులైన్, మరుగుదొడ్ల నిర్మాణానికి రెండు నెలల క్రితం ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

రొంపిచెర్లలో అకాల వర్షం



మండకిందపల్లె కాలనీలో నిలిచిన వర్షపు నీరు

రొంపిచెర్ల, ఏప్రిల్16: మండలంలోని బండకిందపల్లె, పెద్దగొట్టిగళ్లు పంచాయతీలలో గురువారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలపాటు వర్షం కురిసింది. వర్షం పడు సమయంలో ఈదురు గాలులులేక పోవడంతో మామిడి, వరి పంటలకు నష్టం వాటిల్లలేదని రైతులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే చెరువులోని గుంతల్లోకి నీరు చేరాయి. బండకిందపల్లె జగనన్న కాలనీలో వీధులలో నీరుచేరి ఇంకిపోయాయి.

సోమలలో చిరుజల్లులు

సోమల : మండలంలో గురువారం చిరుజల్లులు కురిసాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బందిపడ్డ ప్రజలకు చిరుజల్లులతో ఉపశమనం లభించింది.

శేష వాహనంపై మృత్యుంజయేశ్వరుడి ఊరేగింపు



చౌడేపల్లె, మే16: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో 4వ రోజు ఆది దంపతులు శేష వాహనంపై ఊరేగారు. గురువారం ఉదయం స్వామివారికి ప్రధానార్చకులు రాజశేఖర్, కుమార, మహేష్ దీక్షతులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి శేషవాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్ఠింప చేసి ప్రత్యేకంగా పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల, చెక్క భజనలు, కోలాటలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్య మహిళలు దీవ్వెలు, దీపాలు సమర్పించారు. గ్రామస్తులు కర్పూర హరతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు.

వరసిద్ధుడి సేవలో ఆర్టీఐ కమిషనర్



ఐరాల(కాణిపాకం), మే 16: ఆర్టీఐ కమిషనర్ సి.సునీల్ గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయన్ను ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, పంచాయతీ కార్యదర్శి సత్యం రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



చిత్తూరు (సెంట్రల్), మే 16: వి.కోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సోషల్ టీచర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్వామి కణ్ణన్‌కు డాక్టరేట్ లభించింది. రామకుప్పం మండలం అరిమానుపెంటకు చెందిన ఆయన 'ది రోల్ ఆఫ్ సర్వశిక్షా అభియాన్ అన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ : ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ ఆఫ్ ఏపీ' అనే అంశంపై ఎస్వీయూ డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్ నేతృత్వంలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

పొలంలోకి దూసుకెళ్లిన వ్యాను

శ్రీరంగరాజపురం, మే 16 : వ్యాను విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలంలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. చిత్తూరు నుంచి పళ్లిపట్టు వైపు వెళ్తున్న వ్యాన్ చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై దిగువ ముద్దికుప్పం వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అంతటితో ఆగకుండా పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని వారికి ఎలాంటి గాయాలూ కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రైలుకింద పడి ప్రభుత్వోద్యోగి మృతి



కుప్పం, మే 16: శాంతిపురం ఎంపీడీవో కార్యాలయ ఆఫీస్ అసిస్టెంట్ నరేంద్ర మూర్తి(34)రైలు కింద పడి మృతి చెందాడు. కుప్పంలోని ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై గురు వారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శాంతిపురం ఎంపీడీవో కార్యాలయ ఆఫీస్ అసిస్టెంట్ నరేంద్ర మూర్తిగా గుర్తించారు. నరేంద్రమూర్తికి భార్య, ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో మదనపల్లె నుంచి శాంతిపురం మండలానికి డిప్యుటేషన్ మీద వచ్చారు. మద్యానికి బానిసగా మారారని, ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు.

స్వీపర్ల వేతన బకాయిలు చెల్లించాలి

సోమల, మే 16: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కార్యదర్శి సాంబ శివ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సోమలలో మాట్లాడుతూ ప్రభుత్వం స్వీపర్లకు నెలకు రూ. 6వేల వేతనం ఇస్తోందని, దానిని కూడా నెలనెలా చెల్లించకుండా ఆరు నెలలుగా పెండింగ్‌లో పెట్టిందన్నారు. అరకొర జీతాలతో పని చేసే స్వీపర్లకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు.

నేడు కమ్మపల్లిలో శ్రీరామనవమి

కల్లూరు, మే 16: పులిచెర్ల మండలం కమ్మపల్లిలోని సీతారాముల ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం గణపతిపూజ, కలశస్థాపన, ధ్వజారోహణం, హోమం, ఊంజల్‌సేవ, పట్టువస్త్రాలు సమర్పణ, స్వామి కల్యాణోత్సవం, పుష్పపల్లకి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రేపు వాసవి జయంత్యుత్సవాలు

పలమనేరు, మే16 : పలమనేరులో ఈనెల 18, 19 తేదీల్లో వాసవి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వాసవి ఉత్సవ కమిటీ పేర్కొంది. శనివారం అమ్మవారికి అభిషేకం, లక్ష కుంకుమార్చన లలితా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు, మధ్యాహ్నం మహామంగళహారతి, సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. 9వ తేది సాయంత్రం శయనోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడి మృతి

సోమల, మే 16: కందూరు ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జగన్నాథం శెట్టి గురువారం సాయంత్రం మృతి చెందారు. కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి ఆయన కృషి చేశారు. ఆయన మృతి పట్ల సంఘ సభ్యులు, వాసవీ మహిళా సంఘ సభ్యులు, ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచులు బాషామసూద్, సురేంద్ర రెడ్డి, సౌజన్య శ్రీదేవి నివాళులర్పించారు.

టీబీ రహిత సమాజం నిర్మిద్దాం

చౌడేపల్లె, మే16: టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని సూపర్‌వైజర్ బాబువుద్దీన్ పేర్కొన్నారు. గురువారం ఆయన పెద్దకొండామారిలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక బజారువీధిలో వైద్యసిబ్బంది ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ షుగర్, బీపీ ఉన్న వారు సైతం వ్యాక్సిన్ వేసుకోవచ్చు అని తెలిపారు.

పరిసరాలను శుభ్రం చేస్తే రోగాలు దూరం

పుంగనూరురూరల్, మే16: ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం వల్ల రోగాల నుంచి దూరంగా ఉండగలరని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ముడిపాపనపల్లె, అడవినాథునికుంట గ్రామాల్లో డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కుళ్లిన పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల దోమలు పెరిగి వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చి వడపోసి తాగాలని సూచించారు. వ్యాధి లక్షణాలు హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కండాలు, కీళ్ల నొప్పి, ఆకలి మందగించడం, వాంతు రావడం, చర్మంపై దద్దుర్లు, కళ్లు నొప్పి, ఒక్కోసారి ఒంట్లో రక్త స్రావము జరిగి ప్రాణాలకు ముప్పు రావచ్చుతదితర లక్షణాలు కనబడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి





సోమలలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి - కల్లూరు, సదుం హెల్త్ క్లీనిక్‌లలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

సోమల, మే 16: క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోమల వైద్యాధికారి డాక్టర్ జయసింహ అన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోమల నివారణ కోసం పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. కందూరు, పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీలో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు జరిపారు. ప్రతి గురువారం వైద్యశాలల్లో 60 ఏళ్లు పైబడిన క్షయ, మధుమేహ బాధితులకు బీసీజీ టీకాలు వేస్తారన్నారు. కార్యక్రమాల్లో వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు : దీర్ఘకాలిక వ్యాధులున్న వృద్ధులకు బీసీజీ టీకాలు తప్పక అందించాలని కల్లూరు వైద్యాధికారిణి జానకీరావు తెలిపారు. కల్లూరులో గురువారం బీసీజీ టీకాల పంపిణీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గురువారం సచివాలయాల్లో వృద్ధులకు బీసీజీ టీకాలు వేస్తారన్నారు.

సదుం : మండలంలో 770 మందికి బీసీజీ వ్యాక్సినేషన్ చేయడం లక్ష్యం కాగా గురువారానికి 90 శాతం పూర్తి చేసినట్లు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ గిరీషా తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ భాస్కర, నీలకంఠ, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ




పలమనేరు గడ్డూరు కాలనీ, రొంపిచెర్లలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

పలమనేరు, మే16: పలమనేరు పాతపేట, కాకాతోపు, గడ్డూరు కాలనీ, గొబ్బిళ్లకోటూరులో గురువారం వైద్యఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ ఏవిధంగా సంక్రమిస్తుందో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మదనపల్లి రోడ్డులోని సచివాలయంలో వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ వేశారు. డాక్టర్లు ఆశ, నిరంజన్ కుమార్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల : డెంగ్యూ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి దినేష్‌కుమార్‌నాయక్ అన్నారు. రొంపిచెర్లలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు కాటు వేయడంతో డెంగ్యూ వస్తుందని, వీటి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, ఆరోగ్యవిస్తర్ణాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయచందర్, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె, తీర్థం గ్రామాల్లో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల పరిసరాల్లో నీటినిల్వలు వుండకుండా, పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, డెంగ్యూదోమ పగటిపూట కుడుతుందని, ఇళ్ల కిటికీలు, తలుపులకు మెష్ అమర్చుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోలు అనురాధ, ప్రతిమ, ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తాగునీరు కావాలంటే కొనాల్సిందే..

- సమస్యల వలయంలో నగరి
- మండుటెండలో వారపుసంత




కుశస్థలి నది, మజ్జిగ కాలువల్లో ప్రవహిస్తున్న రంగునీరు, మండుటెండలో వారపుసంత

నగరి, మే 16: నగరి పట్టణం సమస్యల వలయంలో చిక్కుకుంది. తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకని పరిస్థితి. తన హయాంలోనే నగరి అభివృద్ధి జరిగిందని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆర్కే రోజా పదేపదే చెబుతున్నా వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయి. పట్టణానికి నాలుగు వైపులా రంగునీరు నిల్వలు ఉండడంతో భూగర్భ జలాలు కలుషితమ య్యాయి. చుట్టుపక్కల 3 కిలోమీటర్ల వరకు తాగునీరు లభ్యం కావడం గగనమైపోతోంది. మినరల్ వాటర్ కొంటే తప్పా దాహం తీరని పరిస్థితి. దక్షిణాన కుశస్థలి నది, ఉత్తరాన మజ్జిగకాలువ, లింగేష్‌గుంట, తూర్పున మాంగాడు చెరువు, పడమర ఏకాంబరకుప్పం చెరువు రంగునీటితో నిండిపోయాయి. పాలకులు, ప్రభుత్వాలు మారినా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. పట్టణానికి చుట్టుపక్కల 20 కిలోమీటర్ల వరకు నగరి సంత అంటే పేరుంది. అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. గదుల వసతి లేకపోవడంతో మండుటెండలో, వర్షంలో ఇబ్బందులు తప్పడం లేదు. పరదా చాటున వ్యాపారం చేసుకోవాల్సిన దుస్థితి. సంత మైదానంలో ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. ఇప్పటికైనా మంత్రి పట్టణ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

పొన్నియమ్మ ఆలయంలో పొంగళ్లు




పొంగళ్లు పెడుతున్న మహిళలు, భక్తులకు నీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

చిత్తూరు కల్చరల్, మే 16: చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజైన గురువారం పొన్నియమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టారు. భక్తులకు అంబలి పంపిణీ చేశారు.బజారువీధిలో చలువ పందిళ్లు, క్యూలు ఏర్పాటు చేశారు. గిరింపేటలో భక్తులకు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. సంతపేట కనకదుర్గాదేవి ఆలయం, కొంగారెడ్డిపల్లె కరి మారియమ్మ, గంగినేని చెరువు మారియమ్మ, ప్రశాంత్ నగర్ దుర్గాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో పొంగళ్లు పెట్టేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

వైసీపీ విధ్వంస పాలనకు చరమగీతం : టీడీపీ

చిత్తూరు సిటీ, మే 16: వైసీపీ ఐదేళ్లపాటు సాగించిన విధ్వంస పాలనకు ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా పోలింగ్ శాతం నమోదైందని, దీన్నిబట్టి ఓటర్లలో చైతన్యం పెరిగిందని అర్థమవుతోందని అన్నారు. అదే సమయంలో కూటమిపై ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. మోదీ గ్యారెంటీ, టీడీపీ సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు పశువులకు టీకా

చిత్తూరు (సెంట్రల్), మే 16: జిల్లాలోని నల్లజాతి పశువులకు సంక్రమించే వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధి వస్తే పశువులకు తీవ్రంగా జ్వరం వస్తుందని, పాడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నెలాఖరు వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

19న భాగవతంలో స్తుతుల ఉపన్యాసం

చిత్తూరు కల్చరల్, మే 16: ప్రముఖ రచయిత్రి శాంతా భాస్కర్ భాగవతంలో సూక్తులు అనే అంశంపై ఈనెల 19న భాస్కరా హోటల్లో ప్రసంగిస్తారని చైతన్యసాహితి సంస్థ నిర్వాహకులు రాగూరు నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, మే 16: బంగారుపాళ్యం క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ నాయుడు స్థానిక బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గురువారం పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, నాయకులు జనార్దన్ గౌడ్, రమేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15,125 మందికి బీసీజీ వ్యాక్సిన్

చిత్తూరు రూరల్, మే 16: జిల్లావ్యాప్తంగా 15,125 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు చిత్తూరు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. గురువారం నగరంలోని సత్యనారాయణపురం యూపీహెచ్‌సీలో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు పైబడిన ప్రత్యేకమైన వారికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. తొలిరోజు జిల్లావ్యాప్తంగా 563 కేంద్రాల్లో 60 ఏళ్లు దాటిన 6,460 మందికి, స్మోకర్స్ 2 వేల మందికి, షుగర్ వ్యాధిగ్రస్తులు 4,529 మందికి, టీబీ కాంటాక్ట్ 2,136 మందికి వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు. ప్రతి గురువారమూ అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, ఎస్వో జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

గుడిపాల, మే 16: నాలుగు రోజుల క్రితం వీచిన పెనుగాలులకు మామిడి, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏనుగు దాడుల్లో పంట నష్టపోయిన వారికి, దూడలు పోగొట్టుకున్న పాడి రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించే విధంగా చూడాలని కోరారు.

పత్రికా ప్రతినిధులను బెదిరించడం బాధాకరం

● దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మే 16: టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆంధ్రజ్యోతి పత్రికా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్రలను అంతు చూస్తానని బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా రాజకీయ నేతలు వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. వెంటనే సదరు జర్నలిస్టులకు భూమన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వరసిద్ధుడి సేవలో ఆర్టీఐ కమిషనర్


కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈవో

ఐరాల(కాణిపాకం), మే 16: ఆర్టీఐ కమిషనర్ సి.సునీల్ గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి ఆయన్ను ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


స్వామి కణ్ణన్

చిత్తూరు (సెంట్రల్), మే 16: వి.కోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సోషల్ టీచర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్వామి కణ్ణన్‌కు డాక్టరేట్ లభించింది. రామకుప్పం మండలం ఆరిమానుపెంటకు చెందిన ఆయన 'ది రోల్ ఆఫ్ సర్వశిక్షా అభియాన్ ఆన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ : ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ ఆఫ్ ఏపీ' అనే అంశంపై ఎస్వీయూ డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్ నేతృత్వంలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

నెలాఖరు వరకు పశువులకు టీకా

చిత్తూరు (సెంట్రల్), మే 16: జిల్లాలోని నల్లజాతి పశువులకు సంక్రమించే వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధి వస్తే పశువులకు తీవ్రంగా జ్వరం వస్తుందని, పాడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నెలాఖరు వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

గుడిపాల, మే 16: నాలుగు రోజుల క్రితం వీచిన పెనుగాలులకు మామిడి, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏనుగు దాడుల్లో పంట నష్టపోయిన వారికి, దూడలు పోగొట్టుకున్న పాడి రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించే విధంగా చూడాలని కోరారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



గుడిపాల, మే 16: మండలంలోని చీలాపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేక పిల్లలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వారి అవస్థలను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం భవనం మంజూరు చేసింది. కొంతవరకు నిర్మాణం కూడా జరుపుకుంది. తర్వాత ప్రభుత్వం మారడం, కాంట్రాక్టర్‌కు సరిగా బిల్లులు ఇవ్వకపోవడంతో అర్ధంతరంగా పనులు ఆపేశారు. ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న ధరణి నాయుడు

బంగారుపాళ్యం, మే 16: టీడీపీ బంగారుపాళ్యం క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ నాయుడు స్థానిక బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గురువారం పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, నాయకులు జనార్దన్ గౌడ్, రమేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన వ్యాను

శ్రీరంగరాజపురం, మే 16 : వ్యాను విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలంలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. చిత్తూరు నుంచి పళ్లిపట్టు వైపు వెళ్తున్న వ్యాన్ చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై దిగువ ముద్దికుప్పం వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అంతటితో ఆగకుండా పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని వారికి ఎలాంటి గాయాలూ కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

నేడు మండల మీట్

కార్వేటినగరం, మే 16: కార్వేటినగరం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వెలుగు సమాఖ్య ఆఫీసులో జరుగుతుందని ఎంపీడీవో శ్రీధర్ నాయుడు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

19న భాగవతంలో స్తుతులు ఉపన్యాసం

చిత్తూరు కల్చరల్, మే 16: ప్రముఖ రచయిత్రి శాంతా భాస్కర్ భాగవతంలో సూక్తులు అనే అంశంపై ఈనెల 19వ తేదీన భాస్కరా హోటల్లో ప్రసంగిస్తారని చైతన్యసాహితి సంస్థ నిర్వాహకులు రాగూరు నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, మే 16: స్థానిక బ్రాహ్మణవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకారంలో అలంకరించి, పురవీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

వైసీపీ విధ్వంస పాలనకు చరమగీతం : టీడీపీ


మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, మే 16: వైసీపీ ఐదేళ్లపాటు సాగించిన విధ్వంస పాలనకు ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా పోలింగ్ శాతం నమోదైందని, దీన్నిబట్టి ఓటర్లలో చైతన్యం పెరిగిందని అర్థమవుతోందని అన్నారు. అదే సమయంలో కూటమిపై ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. మోదీ గ్యారెంటీ, టీడీపీ సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహ స్‌రాజ్ పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ


యాదమరిలో అవగాహన ర్యాలీ

యాదమరి, మే 16: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీని నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదమరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. డెంగీ జ్వరానికి మందులు లేవని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పీరు సాహెబ్, రామకృష్ణ, అనసూయమ్మ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

దోమల నివారణతో డెంగీ దూరం


తవణంపల్లెలో ర్యాలీ

తవణంపల్లె, మే 16: దోమల నివారణతో డెంగీని దూరం చేయవచ్చునని మండల వైద్యాధికారులు ప్రియాంక, వినయ్ కుమార్, మోహనవేలు తెలిపారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తవణంపల్లెలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి


పాలసముద్రంలో ర్యాలీ..

పాలసముద్రం, మే 16: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, దోమల బెడద లేకుండా చూసుకోవాలని డాక్టర్ కృష్ణమోహన్ కోరారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పాలసముద్రం బీసీ కాలనీవరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు అరుణ, లక్ష్మి, కమల, గంగ పాల్గొన్నారు.

దోమలను నివారించాలి



శ్రీరంగరాజపురం, మే 16: దోమతెర వాడి, దోమల నుంచి రక్షణ పొందాలని ఆరిమాకులపల్లి, ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీల వైద్యాధికారులు బాలసుబ్రమణ్యం, గిరి, సందీప్ కోరారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్‌పురంలో ర్యాలీ నిర్వహించారు.

తప్పులు ఎత్తిచూపితే బెదిరింపులా?

● మీడియా ప్రతినిధులపై

తిరుపతి ఎమ్మెల్యే వ్యాఖ్యలు సిగ్గుచేటు : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్, మే 16: ఎవరు తప్పు చేసినా వాటిని ఎత్తిచూపడం మీడియా బాధ్యత అని, వార్తలు రాసే ప్రతినిధులను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బెదిరించడం సిగ్గుచేటని టీడీపీ చిత్తూరు రూరల్ మండల నాయకులు విమర్శించారు. గురువారం చిత్తూరు రూరల్ టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సభలో తిరుపతి ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతి ప్రతినిధులను బెదిరించడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతికా స్వేచ్ఛను పూర్తిగా హరించారని, ఇలాంటి వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, మేషాక్, రాజా, కందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో నగరి




కుశస్థలి నది, మజ్జిగ కాలువల్లో ప్రవహిస్తున్న రంగునీరు - మండుటెండలో వారపుసంత

● తాగునీరు కావాలంటే కొనాల్సిందే..

● మండుటెండలో వారపుసంత

నగరి, మే 16: నగరి పట్టణం సమస్యల వలయంలో చిక్కుకుంది. తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకని పరిస్థితి. తన హయాంలోనే నగరి అభివృద్ధి జరిగిందని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆర్కే రోజా పదేపదే చెబుతున్నా వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయి. పట్టణానికి నాలుగు వైపులా రంగునీరు నిల్వలు ఉండడంతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. చుట్టుపక్కల 3 కిలోమీటర్ల వరకు తాగునీరు లభ్యం కావడం గగనమైపోతోంది. మినరల్ వాటర్ కొంటే తప్పా దాహం తీరని పరిస్థితి. దక్షిణాన కుశస్థలి నది, ఉత్తరాన మజ్జిగకాలువ, లింగేష్‌గుంట, తూర్పున మాంగాడు చెరువు, పడమర ఏకాంబరకుప్పం చెరువు రంగునీటితో నిండిపోయాయి. పాలకులు, ప్రభుత్వాలు మారినా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. పట్టణానికి చుట్టుపక్కల 20 కిలోమీటర్ల వరకు నగరి సంత అంటే పేరుంది. అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. గదుల వసతి లేకపోవడంతో మండుటెండలో, వర్షంలో ఇబ్బందులు తప్పడం లేదు. పరదా చాటున వ్యాపారం చేసుకోవాల్సిన దుస్థితి ఉంది. సంతమైదానంలో ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. ఇప్పటికైనా మంత్రి పట్టణ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

పులివర్తి నానీకి టీడీపీ నేతల పరామర్శ



నానీని పరామర్శిస్తున్న చిత్తూరు టీడీపీ నేతలు - నానీ యోగక్షేమాలు తెలుసుకుంటున్న యుగంధర్

చిత్తూరు సిటీ, మే 16: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గురువారం చిత్తూరు టీడీపీ నేతలు పరామర్శించారు. తిరుపతిలోని ఆయన నివాసంలో తూర్పుగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణమరాజుతో కలిసి చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నేతలు జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, మంజునాథ్, సుదర్శన్ నాయుడు, సురేంద్ర నాయుడు పరామర్శించారు.

యుగంధర్ పరామర్శ

కార్వేటినగరం, మే 16: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వైసీపీ నేతలను అరెస్టు చేయాలన్నారు.

ఎల్బీఐ లోకేశ్ పరామర్శ

పూతలపట్టు, మే 16: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని మండలానికి చెందిన పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు ఎల్బీఐ లోకేష్ గురువారం పరామర్శించారు. తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, కృష్ణమూర్తి ఆయన వెంట ఉన్నారు.

పొన్నియమ్మ ఆలయంలో పొంగళ్లు




పొంగళ్లు పెడుతున్న మహిళలు - భక్తులకు నీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, మే 16: చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజైన గురువారం పొన్నియమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టారు. భక్తులకు అంబలి పంపిణీ చేశారు. బజారు వీధిలో చలువ పందిళ్లు, క్యూలు ఏర్పాటు చేశారు. గిరింపేటలో భక్తులకు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. సంతపేట కనకదుర్గాదేవి ఆలయం, కొంగారెడ్డిపల్లె కరిమారియమ్మ, గంగినేని చెరువు మారియమ్మ, ప్రశాంత్ నగర్ దుర్గాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పలు ఆలయాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో పొంగళ్లు పెట్టేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

సంక్షేమ హాస్టల్‌కు విద్యార్థుల కొరత


సమీకృత బాలికల హాస్టల్

కార్వేటినగరం, మే 16: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలికల హాస్టల్‌ను విద్యార్థుల కొరత వేధిస్తోంది. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం పరిధిలో ఉన్న బాలికల కోసం కార్వేటినగరంలో దీన్ని ఏర్పాటు చేశారు. 350 మంది బాలికలకు సరిపడా హాస్టల్‌ను అన్ని సౌకర్యాలతో నిర్మించారు. ప్రారంభంలో సజావుగా సాగిన ఈ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య కూడా ఆశాజనంగా ఉండేది. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ విధానాలతో ప్రవేశాల సంఖ్య దిగజారింది. మెనూ చార్జీలు పెంచకపోవడం, హాస్టల్ నుంచి పట్టణంలోని ప్రాథమిక హైస్కూల్‌కు రవాణా సౌకర్యం లేకపోవడం, సిబ్బంది లేక బాలికలకు సరైన రక్షణ లేకపోవడం వంటి కారణాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడ చేర్పేందుకు ఆసక్తి కనబరచడం లేదు. గత విద్యా సంవత్సరం కేవలం 60 మంది మాత్రమే చేరారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైలుకింద పడి ప్రభుత్వోద్యోగి మృతి



కుప్పం, మే 16: శాంతిపురం ఎంపీడీవో కార్యాలయ ఆఫీస్ అసిస్టెంట్ నరేంద్ర మూర్తి(34)రైలు కింద పడి మృతి చెందాడు. కుప్పంలోని ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై గురు వారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. సమాచార మందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శాంతి పురం ఎంపీడీవో కార్యాలయ ఆఫీస్ అసిస్టెంట్ నరేంద్ర మూర్తిగా గుర్తించారు. నరేంద్రమూర్తికి భార్య, ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో మదనపల్లె నుంచి శాంతిపురం మండలానికి డిప్యుటేషన్ మీద వచ్చారు. మద్యానికి బానిసగా మారారని, ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు.

స్వీపర్ల వేతన బకాయిలు చెల్లించాలి

సోమల, మే 16: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కార్యదర్శి సాంబ శివ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సోమలలో మాట్లాడుతూ ప్రభుత్వం స్వీపర్లకు నెలకు రూ. 6వేల వేతనం ఇస్తోందని, దానిని కూడా నెలనెలా చెల్లించకుండా ఆరు నెలలుగా పెండింగ్‌లో పెట్టిందన్నారు. అరకొర జీతాలతో పని చేసే స్వీపర్లకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు.

15,125 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్

● ప్రతి గురువారం వ్యాక్సినేషన్ డే

● డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, మే 16: జిల్లావ్యాప్తంగా 15,125 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు చిత్తూరు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. గురువారం నగరంలోని సత్యనారాయణపురం యూపీహెచ్‌సీలో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు పైబడిన ప్రత్యేకమైన వారికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. తొలిరోజు జిల్లావ్యాప్తంగా 563 కేంద్రాల్లో 60 ఏళ్లు దాటిన 6,460 మందికి, స్మోకర్స్ 2 వేల మందికి, షుగర్ వ్యాధిగ్రస్తులు 4,529 మందికి, టీబీ కాంటాక్ట్స్ 2,136 మందికి వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు. ప్రతి గురువారమూ అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు.

షుగర్ రోగులకు టీబీ వచ్చే అవకాశం

చిత్తూరు : షుగర్ వ్యాధిగ్రస్తులకు టీబీ వచ్చే అవకాశముందని డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి అన్నారు. గురువారం నగరంలోని సత్యనారాయణపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. నగరంలో 18ఏళ్లు పైబడిన వారి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ప్రతి గురువారం వెల్‌నెస్ సెంటర్‌లో టీబీ వ్యాక్సినేషన్ వేస్తామన్నారు.

క్షయ తగ్గించేందుకే బీసీజీ టీకా

నగరి : టీబీ వ్యాధిని తగ్గించేందుకే బీసీజీ టీకా వేస్తున్నట్లు జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలో బీసీజీ టీకా కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అన్ని సచివాలయాల పరిధిలో ఈ టీకా వేస్తున్నట్లు చెప్పారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి

విజయపురం : టీబీ నివారణ కోసం వేస్తున్న బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సోమశేఖర్ కోరారు. విజయపురం పీహెచ్‌సీలో గురువారం ఆయన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారిణి విష్ణుప్రియ పాల్గొన్నారు.

60ఏళ్లు దాటిన వారు టీకా వేసుకోవాలి

తవణంపల్లె, : 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాలు వేసుకోవాలని స్టేట్ జాయింట్ డైరెక్టర్లు సునీల్‌కుమార్‌నాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్‌లు కోరారు. మండలంలోని దిగువమాఘం, తవణంపల్లె, కె.పట్నం సచివాలయాల్లో బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

17,138 మందికి బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యం

గంగాధరనెల్లూరు, మే 16: గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ పరిధిలో 60ఏళ్లకు పైబడిన 17,138 మందికి బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యంగా పెట్టుకున్నామని డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. పాపిరెడ్డిపల్లె, కోటాగరం పంచాయతీల పరిధిలో ఆమె వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.